దర్జాగా కబ్జాలు

- గెడ్డలను కప్పేస్తున్న అక్రమార్కులు
- కొండను తవ్వి నిర్మాణాలు
- జీవీఎంసీ పార్కు స్థలాల ఆక్రమణ
- 8వ వార్డులో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు


స్వర్ణభారతినగర్‌లో గెడ్డను కప్పేస్తున్న దృశ్యం


ముసలయ్యపాలెంలో జీవీఎంసీ మెట్ల మార్గాన్ని తవ్వి చేపట్టిన నిర్మాణం

కొమ్మాది: సహజసిద్ధమైన కొండలు, గెడ్డలు, పార్కు స్థలాలు ఇలా ఒకటేమిటి కనిపించినవాటన్నంటినీ అక్రమార్కులు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఇది అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, పలు కళాశాలలు, ఐటీ కంపెనీలు ఉండటంతో ఇక్కడ గజం స్థలం కూడా లక్షల్లో పలుకుతోంది. అందుకే ఈ వార్డులో ఏ ప్రాంతంలో చూసినా ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ వార్డులో ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, గెడ్డలు కప్పేసినా, పార్కు స్థలాలను పార్కింగ్ స్థలాలుగా మార్చేసినా, కొండలను తవ్వేసినా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదని, ఫిర్యాదులు అందితే తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గెడ్డ ఆక్రమణ

రుషికొండ దరి స్వర్ణభారతి నగర్‌లో శుక్రవారం ఓ వింత సంఘటన చోటు చేసుకుంది. సర్వే నంబరు 18, 19లో గల గెడ్డలో గుర్తు తెలియని వ్యక్తులు భారీ స్థాయిలో డెబ్రిస్ డంప్ చేశారు. దానిని తొలగించాలని జీవీఎంసీ శానిటేషన్ సిబ్బందికి రెవెన్యూ అధికారులు సూచించారు. వాస్తవానికి గెడ్డలో ఎవరైనా డెబ్రిస్ వేస్తే జీవీఎంసీ అధికారులు పొక్లెయిన్‌తో పూర్తి స్థాయిలో తొలగించాలి. కానీ ఇక్కడ మాత్రం దీనికి విరుద్ధంగా జరిగింది. గెడ్డలో డెబ్రిస్ తొలగించడం దేవుడెరుగు. గెడ్డలో 20 అడుగుల వరకు స్థలాన్ని జీవీఎంసీ అధికారులు పొక్లెయిన్‌తో చదును చేయడం సంచలనంగా మారింది. ఓ వ్యక్తి గెడ్డను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో జీవీఎంసీ అధికారులే గెడ్డను పూర్తిగా చదును చేయడమేమిటంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికి తెలిసినప్పటికీ దీనిపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పార్కు స్థలం ... పార్కింగ్ స్థలం

బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జీవీఎంసీ పార్కుస్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ కట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసింది. అయితే ఎన్నికల నేపథ్యంలో కోడ్ ఉన్నందున పనులు నిలిపివేశారు. వెనువెంటనే జీవీఎంసీ అధికారులు స్థలం సంరక్షణలో భాగంగా స్థలం


తొలగించిన పోల్స్


పార్కు స్థలంలో నిలిపిన వాహనాలు


తాటిచెట్లపాలెంలో ఆక్రమణకు గురైన గెడ్డ

చుట్టూ పోల్స్ వేసి ఫెన్సింగ్ వేశారు. అయితే ఈ పార్కు స్థలం కాస్త ప్రస్తుతం పార్కింగ్ స్థలంగా మారిపోయింది. దీనికి సమీపంలో ఉన్న అపార్టుమెంటు వాసులు తమ నివాసాలకు సెల్లార్లు లేకపోవడంతో ఇక్కడ వేసిన ఫెన్సింగ్, పోల్స్‌ను తొలగించి తమ వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు.

ముసలయ్యపాలెంలో ..

ఇక్కడ సాగర్‌నగర్ దరి ముసలయ్యపాలెంలో అనధికార నిర్మాణాలకు అదుపు లేకుండాపోతోంది. ఈ ప్రాంతాలకు గతంలో జీవీఎంసీ నిధులతో మెట్ల మార్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు కొందరు మెట్ల మార్గాన్ని ఆనుకుని, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మెట్ల మార్గానికి రిటర్నింగ్ వాల్ ఏర్పాటు చేసి కొంత సెట్ బ్యాక్‌లు ఉంచి ఇళ్లు నిర్మించాలి. కానీ ఇవన్నీ పక్కన పెడితే కనీసం పట్టణ ప్రణాళికా విభాగం నుంచి ఒక్క అనుమతి కూడా లేకుండా నిర్మాణం చేపడుతున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు. అదే విధంగా తాటిచెట్ల పాలెం గెడ్డలో ఓ వ్యక్తి డెబ్రిస్ వేసి భారీ స్థాయిలో ఆక్రమించినా చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వార్డులో ఏదైనా సంఘటన జరిగితే మాకు సంబంధం లేదంటూ రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తప్పించుకుంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

8వ వార్డు ముసలయ్యపాలెంలో జీవీఎంసీ మెట్ల మార్గం తవ్విన విషయం మా దృష్టికి వచ్చింది. జీవీఎంసీ పార్కు స్థలాల ఆక్రమణలు, గెడ్డ ఆక్రమణలు మాదృష్టికి వచ్చాయి. ప్రతి ఒక్కటీ పరిశీలించి జీవీఎంసీ ఆస్తుల పరిరక్షణలో భాగంగా కఠినమైన చర్యలు తీసుకుంటాం. ముసలయ్యపాలెం పనులు తక్షణమే ఆపివేస్తాం.

– కనకమహాలక్ష్మి, జోనల్ కమిషనర్, జోన్ -2.

సుప్రీంకోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంప పెట్టు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు

తగరపువలస: సుప్రీంకోర్టు తీర్పు కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిదని వైఎస్సార్ సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను హరిస్తూ కూటమి ప్రభుత్వం అరెస్టు చేసిన సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును విడుదల చేయాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించిడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, ప్రభుత్వ పాలన గాడి తప్పిందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. నోటీసులు ఇవ్వకుండా 70 ఏళ్ల వయసు ఉన్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని అరెస్టు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రంలో కక్షపూరిత చర్యలు అరెస్టులకు స్వస్తి పలకాలన్నారు.

వివాహిత అదృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లి కళ్లాలకు చెందిన తొగురోతు దేవిక(25) అనే వివాహిత అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె భర్త రవి ఆనందపురం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. దేవిక తన మామ ఆదిబాబుతో కలిసి శుక్రవారం బ్యాంకు పనిమీద ఆనందపురం వచ్చారు. మామను రోడ్డు పక్కన ఉంచిన దేవిక టైలర్ వద్ద నుంచి దుస్తులు తీసుకు వస్తానని చెప్పి అతని ఫోన్ కూడా తీసుకు వెళ్లింది. తరువాత భర్తకు ఫోన్ చేసి టైలర్‌కు డబ్బులు ఇవ్వాలని అందుకు ఫోన్ పే చేయాలని కోరింది. తరువాత నుంచి ఆమె అదృశ్యం కావడంతో భర్త, మామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

అదనపు పీవోగా సంతోషి బాధ్యతల స్వీకరణ


సంతోషి కుమారి

భీమునిపట్నం: ఐసీడీఎస్ అదనపు పీవోగా సీహెచ్. సంతోషికుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనంతగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సూపర్‌వైజర్లు జె.రేఖావాణి, కె.ప్రమీల, రత్నం తదితరులకు బదిలీ కాగా, వారి స్థానంలో శిరీష, సుస్మిత, నాగమణి,పార్వతి, జియా ఉన్నీషా బేగం బాధ్యతలు స్వీకరించారు.

ఆర్‌వీపురంలో విద్యార్థులకు కిట్ల పంపిణీ


ఆర్‌వీపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఎస్‌ఆర్‌కేవీఎం కిట్లను ఎంపీపీ కంటుబోతు రాంబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, రేవిడి ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, వెంకటాపురం సర్పంచ్ కర్రి రమణ, రేవిడి మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఆవాల గంగరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు మరగడ అప్పారావు పాల్గొన్నారు.

నేడు రక్తదాన ఆవశ్యకతపై అవగాహన


దళాయి శివ

తగరపువలస: ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా శనివారం ఆనందపురం మండలంలో పలుచోట్ల రక్తదానం ఆవశ్యకత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఓఎస్‌జీ ఫౌండేషన్ నిర్వాహకుడు దళాయి శివ తెలిపారు. శుక్రవారం ఆయన ఆనందపురంలో మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 49 రక్తదాన శిబిరాలు నిర్వహించినట్టు చెప్పారు. రక్తం అందకుండా ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదని, ప్రాణాపాయంలో ఉన్న మరో వ్యక్తికి పునర్జన్మ అందించాలని శివ కోరారు.

దివీస్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో జనరల్ మేనేజర్ కోటేశ్వరరావు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబరేటరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తయింది. శిక్షణ పొందిన 140 మంది గ్రామీణ విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎం.ఎస్.ఎన్.రావు ఆధ్వర్యంలో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పుడు ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించడానికి కంప్యూటర్ శిక్షణ అవసరమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సి.ఎస్.ఆర్ మేనేజర్లు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, పి.శేఖర్‌బాబు, కె.నరసింహారావు, బిందు శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆవును ఢీకొన్న ఆటో


దెబ్బతిన్న ఆటో ముందు భాగం (ఇన్‌సెట్) గాయపడిన ఆవు

మధురవాడ: చంద్రంపాలెం వద్ద హైవేపై శుక్రవారం సాయంత్రం ఓ ఆవును విశాఖ నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. ఆవుతో పాటు ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. ఆటోలో ఉన్న మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

తరగతుల విలీనాన్ని నిలిపివేయాలని ధర్నా


ప్లకార్డులతో ఆందోళన చేస్తున్న ఇసకలపాలెం గ్రామస్తులు

పద్మనాభం: పద్మనాభం పంచాయతీ ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులను పద్మనాభం మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడాన్ని నిలిపి వేయాలని కోరుతూ శుక్రవారం ఇసకలపాలెం గ్రామస్తులు, విద్యార్థుల తల్లి దండ్రులు మండల విద్యా శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విలీనాన్ని నిలిపివేయాలని మండల విద్యా శాఖ కార్యాలయం సిబ్బందికి ఎస్‌ఎంసీ చైర్మన్ హంస జ్యోతి, వైస్ చైర్మన్ ముచ్చుపల్లి భారతి, విద్యార్థులు తల్లిదండ్రులు వినతి పత్రం ఇచ్చారు. ఇసకలపాలెం ప్రాథమిక పాఠశాలలో 50 ఏళ్ల నుంచి ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహిస్తున్నారని ఆ వినతి పత్రంలో తెలిపారు. విద్యార్థులు ఇసకలపాలెం నుంచి పద్మనాభం రావాలంటే రాష్ట్ర రహదారి దాటి రావాలని పేర్కొన్నారు. ఈ రోడ్డుపై భారీ వాహనాలైన బస్సులు, ఇటుక లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం తిరుగుతుండడం వల్ల విద్యార్థులు ప్రమాదాల బారిన పడతారని తెలిపారు. ఇసకలపాలెం నుంచి కిలో మీటరు నడిచి పద్మనాభం మోడల్ ప్రైమర్ పాఠశాలకు రావడానికి చిన్నారులు ఇబ్బందులు పడతారని వినతి పత్రంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపురం ఎంపీటీసీ మాజీ సంభ్యుడు గంగిరెడ్ల పద్మనాభ స్వామి, బీజేపీ నాయకుడు హంస మహేష్, అలమండ అప్పారావు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి జ్ఞాన వేణి


జమ్మిచెరువు వాకర్స్‌తో మాట్లాడుతున్న జడ్పీ అయ్యప్పనాయుడు

పద్మనాభం: విశాఖపట్నంలో ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్రను విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి కె.జ్ఞాన వేణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో యోగాంధ్రపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. యోగాంధ్ర కార్యక్రమంలో ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ సిబ్బంది దీనిలో కీలక పాత్ర పోషించాలన్నారు. సచివాలయ సిబ్బంది సచివాలయ స్థాయిలో శనివారం నుంచి యోగాలో మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, తహసీల్దార్ కె.ఆనంద రావు, విద్యుత్ ఏఈ జగన్‌మోహనరావు, ఈవోఆర్డీ మీనా కుమారి, పీడీలు పాల్గొన్నారు.

భీమునిపట్నం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 21న భారీ ఎత్తున నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి అందరూ సహకరించాలని జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు అన్నారు. శుక్రవారం భీమిలిలోని జమ్మిచెరువు పార్కులోని వాకర్స్‌తో ఆయన మాట్లాడారు, బీచ్‌రోడ్డులో భీమిలి నుంచి తిమ్మాపురం వరకు 3,500 మందితో కార్యక్రమాన్ని నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఈ కార్యక్రమంలో అందరూ తప్పని సరిగా పాల్గొన్నాలని, ఇందు కోసం పేర్లకు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారికి యోగా చేసే మ్యాట్‌తోపాటు టీ షర్టు అందజేయనున్నట్టు ఆయన చెప్పారు.

నేటి యోగా శిబిరాలను విజయవంతం చేయాలి


ఆనందపురం సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో జానకి

తగరపువలస: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆనందపురం మండలంలోని సచివాలయాలు, విద్యాసంస్థలలో నిర్వహించే మోడల్ యోగా శిబిరాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో జానకి కోరారు. ఆమె శుక్రవారం పలు గ్రామ సచివాలయాలను సందర్శించారు. 154 యోగా శిక్షణ కేంద్రాలలో ఈ మోడల్ యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. అనంతరం మిగిలిన పాఠశాలలు, సచివాలయాలను సందర్శించి అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు.

తాగునీరు వృథా


సామయ్యవలస వద్ద వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస వద్ద తాగునీరు వృథాగా పోతోంది. రక్షిత మంచినీటి పథకానికి మోటార్ల ద్వారా నీరు సేకరించినప్పుడు, వాల్వ్‌లు కట్టకపోయినప్పుడు ప్రతిసారి నీరు ఇలా బయటకు పోతోంది. వాస్తవానికి రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టక ముందు నుంచి పైపులైన్ ద్వారా ఈ ప్రాంతంలో నీరు వృథా కావడం ఇక్కడ సర్వసాధారణం. అయినా గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది, పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని సామయ్యవలస గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా స్పందించి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ఫ్రెండ్స్ ఉపకారం

- ఎన్‌ఎంఎంఎస్ ఫలితాల్లో సత్తాచాటిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యార్థులు


చిట్టివలస ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు

తగరపువలస: చిట్టివలసకు చెందిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ తన సేవా కార్యక్రమాలలో భాగంగా నాలుగేళ్లుగా 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్‌స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)లో ఉచిత శిక్షణ ఇస్తోంది. గత ఏడాది డిసెంబరు 8న జరిగిన ఈ పరీక్షకు సంబంధించి చిట్టివలస జెడ్పీహైస్కూల్‌లో భీమిలి అర్బన్, రూరల్ పాఠశాలలకు చెందిన వంద మందికి పైగా విద్యార్థులు హాజరుకాగా ఇటీవల ఫలితాలు వెల్లడయ్యాయి. ఇందులో 24 మంది ఎంపికయ్యారు. ఆరు నెలల పాటు సాగే ఈ ఉచిత శిక్షణ సెలవురోజుల్లో ఉంటుంది. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సేవాభావంతో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

ఏడుగురితో బోణీ

నాలుగేళ్ల క్రితం ఉచిత శిక్షణ ప్రారంభించిన ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ నుంచి ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసిన ఏడుగురు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. తరువాత రెండేళ్ల పాటు వరుసగా 22, 18 మంది విజయం సాధించారు. గత విద్యా సంవత్సరంలో అత్యధికంగా 24 మంది విద్యార్థులు విజయం సాధించారు. వీరిలో ముగ్గురు జిల్లా స్థాయిలో 2,28,36వ ర్యాంకులు పొందారు. రాష్ట్రంలో ఇంత పెద్దస్థాయిలో ఉచిత శిక్షణ ఇస్తున్న సొసైటీ ఇదే. ఈ పరీక్షలో ఎంపికైన పేద విద్యార్థులకు నాలుగేళ్లపాటు నెలకు రూ.12 వేల చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు రూ.48వేలు కేంద్ర విద్యాశాఖ అందిస్తుంది. సొసైటీ ఉచిత శిక్షణతో పాటు విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం స్నాక్స్, తాగునీరు తదితర సదుపాయాలు కల్పిస్తుండగా గత ఏడాది చిట్టివలస సత్యసాయిసేవాసమితి, వింగ్స్ ఫౌండేషన్, స్నిగ్ధశ్రీ ఫౌండేషన్, దత్తి ఈశ్వరరావు, నందిక శ్రీను, శివకుమార్, గొట్టిపల్లి సత్యనారాయణ తదితరులు విద్యార్థులకు మెటీరియల్, స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ అందించి తమ వంతు సాయం చేశారు.

ఆలోచన శక్తి పెరుగుతుంది



ఈ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు సొంతంగా నిర్ణయాలు తీసుకోగలుగుతారు. వారి ఆలోచన శక్తి పెరుగుతుంది. మంచి మార్కులు సాధించగలరు. సొసైటీలో 20 మందికి పైగా ప్రభుత్వ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తూ ఉపకార వేతనం గ్యారంటీ అంటూ విద్యార్థులను ప్రోత్సహిస్తారు.

– యాగాటి వెంకటరమణ, ఉపాధ్యాయుడు

ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీ



ఇది జాతీయస్థాయి పరీక్ష కావడంతో ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీ పడుతున్నాం. మా స్థాయి ఏంటో మాకు తెలుస్తుంది.సొసైటీ నిర్వాహకుల శ్రమ, ఉపాధ్యాయులు పట్టుదలకు స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహం బాగుంది. స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

–బి.వరుణ్ సందేష్, సంతపేట

సెలవులు సద్వినియోగం



సెలవురోజుల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణ పొందాం. ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్ష ఏ ఒక్క సబ్జెక్టుకో పరిమితం కాలేదు. గణితం, సోషల్, సైన్స్, మెంటల్ ఎబిలిటీకి సమాన ప్రాధాన్యత ఇస్తున్నారు. విజ్ఞానంతో పాటు ఉపకార వేతనం సాధించాం.

– ప్రణతి, చిట్టివలస

మెంటల్ ఎబిలిటీపై పట్టు



ఈ పోటీ పరీక్ష ద్వారా 8వ తరగతిలోనే మాకు మెంటల్ ఎబిలిటీపై అవగాహన పెరుగుతుంది. భవిష్యత్తులో పోటీపరీక్షలను ధీటుగా ఎదుర్కోగలం. మాలాంటి పేద విద్యార్థులు ఈ పరీక్షలో అర్హత సాధించడం వల్ల ఏటా రూ.12వేల ఉపకార వేతనం లభిస్తుంది. మాకు ఇది చాలా ఉపయోగకరం.

– టి.పూజిత, వెల్లంకి

సబ్జెక్టులపై మరింత అవగాహన



సొసైటీ ద్వారా ఉపాధ్యాయులు ఉచితంగా ఇస్తున్న శిక్షణ మాకు ఇంటర్మీడియెట్ వరకు ఉపయోగపడుతుంది. మిగిలిన విద్యార్థుల కంటే ముందు ఉండగలుగుతాం. వివిధ సబ్జెక్టుల్లో నైపుణ్యం సాధించడం ద్వారా 10వ తరగతి తరువాత ట్రిపుల్ ఐటీ, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు అర్హత సాధించగలుగుతాం. మాపై మరింత నమ్మకం పెరుగుతుంది.

– వి.తేజస్విని, చిన ఉప్పాడ

పోటీ పరీక్షలకు అలవాటు



ఎన్‌ఎంఎంఎస్ శిక్షణకు హాజరయ్యే విద్యార్థులు పోటీ పరీక్షలకు అలవాటు పడతారు. అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించగలుగుతారు. రాష్ట్రంలో ఎక్కడా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఉచితంగా ఇంత పెద్ద ఎత్తున శిక్షణ ఇవ్వడం లేదు. ఈ పరీక్ష ద్వారా స్కాలర్‌షిప్ సాధించాలని మాతో పాటు మాకు శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుల పట్టుదలగా సేవా భావంతో పనిచేస్తున్నారు. దీనిని కొనసాగిస్తాం.

– గంటాన మోహనరావు, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు

మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు


మాట్లాడుతున్న బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం: మానవ సమాజ మనుగడకు అత్యంత ప్రమాదికారిగా తయారైన మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు అందరూ కృషి చేయాలని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా శుక్రవారం బెటాలియన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలయితే జీవనం దుర్భరమవుతుందన్నారు. గ్రీన్ వ్యాలీ సంస్థ ఫౌండర్ డాక్టర్ ఉమారాజ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులను, యువతను చైతన్యవంతులను చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ పి.సత్యం, అసిస్టెంట్ కమాండెట్లు ఎన్. మురళీధర్, వి.నారాయణరావు, బి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలతో నష్టపోయిన నువ్వు రైతు


దిగుబడి రాని నువ్వు పంట

తగరపువలస: నాసిరకం విత్తనాల కారణంగా భీమిలి మండలం తాటితూరు పంచాయతీలో నువ్వు రైతులు నష్టపోయారు. స్థానిక వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఇక్కడి రైతులు అనకాపల్లి జిల్లా చోడవరం మండలం కొండెంపూడికి చెందిన ప్రభుత్వ విత్తనాల స్టోర్‌లో కిలో రూ.210 చొప్పున విత్తనాలు కొనుగోలు చేసి పొలంలో జల్లారు. నువ్వుల మొక్కలు ఏపుగా పెరిగినా దిగుబడి లేకపోవడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమిలి వ్యవసాయాధికారుల సూచనల మేరకే తాము అక్కడ వరకు వెళ్లి విత్తనాలు తెచ్చినట్టు ఒరుపుల శ్రీనివాసరావు అనే రైతు వాపోయాడు. ప్రభుత్వ స్టోర్ ద్వారా విక్రయించే విత్తనాలే నాసిరకంగా ఉంటే ఇక ప్రైవేట్ స్టోర్‌లలో కొనుగోలు చేసే విత్తనాలకు ఏమి భరోసా ఉంటుందని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.